ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 4 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

4-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	26
బాపట్ల	37	27
రెంటచింతల	40	27



నరసరావుపేట మున్సిపల్ బాలుర స్కూల్‌లో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

నాడు-నేడు నాస్బుడు

- పాఠశాలల్లో పనులపై నీలినీడలు
- నిలిచిన పనులతో ఏడాదంతా అవస్థలే
- పనుల పూర్తిపై ప్రభుత్వంలో కొరవడిన స్పష్టత
- విద్యా సంవత్సరం ప్రారంభానికైనా పూర్తి చేయాలని వినతి

నాడు-నేడుతో అద్భుతాలు సృష్టిస్తాం. కార్పొరేట్ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు సమకూరుస్తాం.. అని గత వైసీపీ పాలకులు హడావుడి చేశారు. మొదటి, రెండు విడతలు పేరుతో వేల కోట్లు మంజూరు చేశామని.. వేల పనులు చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే వైసీపీ హయాంలో నిధులు విడుదల కాక.. పనుల సాగలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఆయా పనులు నిలిపేసింది. దీంతో ఏడాదిగా నాడు-నేడు పనులు ముందుకు సాగక అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అనేక పాఠశాలల్లోని తరగతి గదులు నాడు-నేడు సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు చెట్ల కింద, వరండాల్లో బోధన చేయాల్సి వచ్చింది. ఏడాది గడిచినా నాడు-నేడు పనులపై ప్రభుత్వంలో స్పష్టత లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో పాఠశాలల్లో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా ఆయా పనులపై నీలినీడలు అలుముకున్నాయి. రానున్న విద్యా సంవత్సరం కల్లా తరగతి గదుల పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం స్పందించాలని తల్లిదం డ్రులు కోరుతున్నారు.

నిధులు ఇవ్వక.. పనులు సాగక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. అన్ని వసతులు కల్పించాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా పనులు సాగుతాయనుకుంటే నిరాశే మిగిలింది. ఏడాదిగా ఏ ఒక్క బడిలోనూ ప్రగతి పని ముందడుగు పడలేదు. పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పన మాటేమో కాని ఏడాదంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో విడతలో చేపట్టిన పనులను కూటమి ప్రభు త్వం పూర్తి చేస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. అనేక ఆరోపణల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మం జూరు చేసినట్లు నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే నిధుల విడుదలలో చతికిలపడింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపి వేశాయి. నాడు నేడు పనుల పూర్తిపై గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నాడు-నేడు పేరుతో అనేక పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేయడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా పాలకుల్లో స్పందన లేకుండా పోయింది. నూతన గదులు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తరగతిగదుల సమస్య నెలకొంది. ఇకమరుగుదొడ్ల నిర్మాణం సాగక ఏడాదిగా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పాఠశాలల్లో

(మిగతా 6వ పేజీలో)



ములకలూరులో పూనాదులు దాటని తరగతి గది నిర్మాణం

బీటెక్కే

- ఖాళీగానే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు
- 40 శాతం మంది పట్టభద్రులకు పని లేదు
- కొలువుల కోసం ఉన్నత విద్యావంతుల నిరీక్షణ
- ఉపాధి లేని వారిపై ఇంటింటి సర్వే చేసిన ప్రభుత్వం
- మూడు జిల్లాల పరిధిలో 16,91,432 మంది నిరుద్యోగుల గుర్తింపు
- సాంకేతిక విద్యార్థుల్లో 80 శాతం మందికి ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బీటెక్ చేసినా ఖాళీగానే ఉంటున్నారు. పేరుకు బీటెక్ చదివినా తగిన ఉద్యోగం లేక ఇంటి పట్టున లేదంటే ఏదో ఒక కోర్సు అభ్యసిస్తూ అనేక మంది ఉంటున్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు కూడా అర్హతకు తగిన కొలువు దొరక్క అల్లాడుతున్నారు. ఇక పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా పని చూపితే చేసుకుంటామని ఎదురు చూస్తున్న వారిలో ఎలాంటి విద్యార్హతలు లేని వారు లక్షల్లో ఉన్నారు. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మొదలు పెట్టింది. ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి చేయడానికి ఎటువంటి పనిలేకుండా ఖాళీగా ఉన్న వారి వివరాలను సేకరించింది. విద్యార్హతలు, గతంలో ఏమన్నా పని చేసి మానేశారా.. అనే అంశంతో పాటు ఏ రంగంలో శిక్షణ తీసుకుని రాణిస్తారు.. తదితర అంశాలపై సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం డాటా సేకరించింది. ప్రభుత్వం ఉపాధి చూపెడితే ఇంటి వద్ద నుంచే పనిచేయడానికి ఎంతమందికి ఆసక్తి ఉంది అని అంశంపై కూడా ఆరా తీసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు ప్రామాణికంగా సచివాలయ ఉద్యోగుల చేత ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. మూడు జిల్లాల పరిధిలో 16,91,432 గుర్తించింది. వీరంతా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, తోడ్పాటు కోసమే ఎదురుచూస్తున్నారని నివేదికలో సిబ్బంది పొందుపరిచారు. బాపట్ల జిల్లాలో 5,17,823 మంది ఉపాధిలేని వారిని గుర్తించగా, గుంటూరు జిల్లాలో ఇది 5,86,100గా ఉంది. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అత్యధికంగా 5,87,609 మంది చేయడానికి పని దొరక్క, ఖాళీగా ఉండడమో లేక వారి విద్యార్హతలకు తగిన కొలువు దొరక్క ప్రయత్నాల్లోనో ఉన్నట్లు సర్వేలో తేల్చారు. ఖాళీగా ఉన్నవారిలో దాదాపు 40 శాతం మంది పట్టభద్రులే కాగా ఇందులో కూడా బీటెక్ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారే అధికంగా ఉన్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు 15 శాతం మంది ఖాళీగా ఉంటుండగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో చేస్తున్న కొలువు కోల్పోయిన వారు 15 శాతం మంది ఉన్నట్లు సర్వేలో తేలింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు, ఎలాంటి విద్యార్హతలు లేకుండా ప్రభుత్వం ఏదన్నా పని చూపిస్తే చేసుకుంటామన్న వారిలో మహిళలే అధికంగా ఉండగా మొత్తం నిరుద్యోగుల్లో వీరిది 30 శాతంగా ఉండడం గమనార్హం. సర్వేలో ఉపాధిలేని వారిగా గుర్తించిన వారిలో 80 శాతం మందికి మూ డునెలల వ్యవధిలోనే కొలువు చూపెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

శిక్షణ.. ప్రైవేటు సెక్టార్‌తో అనుసంధానం

సర్వేలో భాగంగా వివిధ విభాగాల మీద ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత కారణంగా వాటిని నేర్చుకోలేకపోయామని పలువురు వెల్లడించారు. తొలుత వారందరికీ ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోనుంది. దీనికి సమాంతరంగా విద్యార్హతలను బట్టి ప్రైవేటు కంపెనీలకు ఉద్యోగార్థులకు అనుసంధానకర్తగా ప్రభుత్వం ఉంటూ వారిని ఉపాధి వైపు నడిపించే కార్యక్రమానికి కసరత్తు మొదలుపెట్టింది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇళ్ల వద్దే ఉపాధి కల్పించే మార్గాల అన్వేషణలో యంత్రాంగం ఉంది. ఇంటి వద్దే తయారు చేసే గృహోపకరణాలు, పచ్చళ్లు, తినుబండారాలు, ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన వంటివన్నీ మహిళల ఉపాధి కల్పనలో భాగం చేయడానికి ప్రభుత్వం సదరు విభాగాలను సమాయత్తం చేసింది.

సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు..

సర్వేలో భాగంగా పని లేకుండా ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పట్టభద్రులపైన ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. తొలుత జిల్లాకు 1000 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లకు కొలువులు చూపెట్టే దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా వారికి కొలువులు కల్పించే పనిని సదరు కంపెనీలు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని త్వరలో జిల్లాలోని ఓ వేదికలో మెగా ఆన్‌లైన్ పరీక్షలను చేపట్టి ఒకేసారి వేల మందికి ఉపాధి చూపెట్టేలా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఈ క్రమంలో ఆయా కంపెనీలకు తగ్గట్టుగా నిరుద్యోగుల్లో నైపుణ్యాలు లేకపోతే వారే అందుకు సంబం ధించిన శిక్షణ ఇచ్చేటట్లు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



వేటపాలెం : కొత్తపేట సచివాలయంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన బీటెక్ గ్రాడ్యుయేట్ (పాత చిత్రం)

రూ.కోట్లతో జీజీహెచ్‌లో సౌకర్యాలు

రూ.86 కోట్ల ఎంసీహెచ్ బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి

- స్టెప్‌డౌన్ ఐసీయూ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా 15 పడకలతో నూతనంగా నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కోసం నూతనంగా రూపొందించిన లోగోను మంత్రి ఆవిష్కరించారు. జీఎంసీ 80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రామారావు, శారద ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.9 లక్షల విరాళం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు అందజేసిన రూ.10 కోట్ల విరాళంతో వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎస్ఆర్ కింద వచ్చిన రూ.15 కోట్లతో కూడా మరికొన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఐసీయూకు రూ.1.60 కోట్ల విలువైన నాలుగు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, ఆరు మొబైల్ వెంటిలేటర్లను విరాళంగా అందజేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు ఏసీలు, పడకలు అందజేసిన దాతలను పెమ్మసాని అభినందించారు. దాతలు, పారిశ్రామికవేత్తలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నాట్కో వంటి కార్పొరేట్ కంపెనీలు జీజీహెచ్‌ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌లో కొత్తగా ప్రారంభించిన స్టెప్‌డౌన్ ఐసీయూతో మరో 15 పడకలు అదనంగా అందుబాట్లోకి వస్తున్నాయని తెలిపారు. పూర్వ విద్యార్థుల వితరణతో ఆస్పత్రి ఆవరణలో రూ.86 కోట్లతో చేపట్టిన ఎంసీహెచ్ బ్లాక్ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని ప్రకటించారు.



ఆసుపత్రి లోగోను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

పది నెలల్లో పెరిగిన విశ్వాసం

సాయం చేసేందుకు పలువురు దాతలు సిద్ధంగా ఉన్నా గత వైసీపీ అసమర్థత చూసి ఎవరూ ముందుకు రాలేదని పెమ్మసాని తెలిపారు. పది నెలల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, దీంతో ఎందరో దాతలు ముందుకు వచ్చి గుంటూరు జీజీహెచ్‌లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. జీజీహెచ్‌లో ఏనాడైనా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టిందా అని కేంద్ర మంత్రి నిలదీశారు. పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నశీర్ అహ్మద్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, భాష్యం రామకష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

రాజధానిలోనే రాజ్‌భవన్

- గవర్నర్, సీజేలతో మంత్రి నారాయణ చర్చలు
- ఐకానిక్ భవనాల డిజైన్స్‌పై..
- నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో మంత్రి సమావేశం

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ) పరిధిలోనే రాజ్ భవన్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌భవన్ డిజైన్ ఎలా ఉండాలన్న దానిపై శనివారం మంత్రి నారాయణ, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి చర్చించారు. రాజ్‌భవన్ ఎలా ఉండాలి? ఆర్కిటెక్చరల్ డిజైన్ ఎలా ఉంటే బాగుంటుంది? ఇంటీరియర్ స్ట్రక్చర్ ఎలా ఉండాలి? ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సిబ్బంది ఎంత మంది ఉంటారు? సమావేశాలకు, ఇతర అవసరాలకు అనుగుణంగా ఏమేమి ఏర్పాటు చేయాలి? ఓపెన్ ఏరియా, గార్డెన్ వంటి సదుపాయాలకు సంబంధించి గవర్నర్ నుంచి మంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా కొన్ని సూచనలు చేసినట్లు సమాచారం.

ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్స్‌పై..

అమరావతి రాజధానిలో తలపెడుతున్న ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై మంత్రి నారాయణ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్‌అండ్ టీ సంస్థల ప్రతినిధులతో సమావేశమ య్యారు. హైకోర్టు కాంప్లెక్స్‌లో ఎన్ని గదులు ఉండాలి? ఆర్కిటెక్చర్ ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంతకు ముందే మంత్రి నారాయణ హైకో ర్టు సీజేతో హైకోర్టు కాంప్లెక్స్‌కు సంబంధించి చర్చించారు. హైకోర్టు కాం ప్లెక్స్‌లో 52 గదులు కావాలని సీజే సూచించినట్లు సమాచారం. డిజైన్‌ను బట్టి అన్ని గదులు కష్టమని మంత్రి నారాయణ చెప్పగా 48 గదులు ఖచ్చి తంగా ఉండాలని సీజే చెప్పారని తెలుస్తోంది. సీజే వ్యక్తపరిచిన విధంగా హైకోర్టు కాంప్లెక్స్‌లో చేపట్టాల్సిన ఇటర్నల్ డిజైన్స్, రూమ్స్‌పై నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. హైకోర్టు కాంప్లెక్స్‌పైన సందర్శకుల కోసం టవర్ ఏర్పాటుపై చర్చించారు. అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ, మండలితో పాటు లోపల ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి.. సమావేశ మందిరాలు..ఆర్కిటెక్చరల్ డిజైన్స్ ఎలాఉండాలి.. అన్నదానిపై చర్చించారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

7న శంకర్ విలాస్ బ్రిడ్జికి శంకుస్థాపన

గుంటూరు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో శంకర్ విలాస్ బ్రిడ్జికి బుధవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు శనివారం కమిషనర్ పులి శ్రీనివాసులు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి ఏసీ కళాశాల నుంచి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన విస్తరణ పనులు, మార్కింగ్ అంశాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. శంకుస్థాపన జరిగే ప్రదేశాన్ని నిర్ణయించిన అనంతరం శిలాఫలకం ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ చిన్నయ్య, ఏఈ సంజీవకుమార్, తదితరులు పాల్గొన్నారు.




శంకర్ విలాస్ బ్రిడ్జి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రూ. 69 కోట్ల.. జడ్పీ బడ్జెట్‌కు మోక్షం
రాజసానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక 6

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

- 11 గంటల నుంచే విద్యార్థులకు అనుమతి
- కేంద్రాల్లో ఏర్పాట్లను. పరిశీలించిన డీఈవో రేణుక



చౌత్రాసెంటర్‌లోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో సీవీ రేణుక, డాక్టర్ విజయకుమార్

గుంటూరు(విద్య), మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆదివారం జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. శనివారం గుంటూరులోని పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించి, ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గుంటూరులో 16 కేంద్రాలు ఏర్పాట్లు చేశారని ఇందులో 4250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను 11 గంటలకు అనుమతిస్తామని అప్పటికల్లా హాజరు కావాలని తెలిపారు. కేంద్రాల వద్ద నిశితంగా విద్యార్థులను పరిశీలించిన తర్వాత లోనికి అనుమతి ఇస్తామన్నారు. అడ్మిట్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒక పోస్ట్ కార్డు సైజు ఫొటో, ప్రభుత్వ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు విద్యార్థుల వద్ద తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, క్యాలిక్యులేటర్లు, పుస్తకాలను కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

గుంటూరు, తెనాలిలో కేంద్రాలు ఇవే..

గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(సాంబశివపేట), ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(సాంబశివపేట), డాక్టర్ పినపాటి ప్రభుదాస్ మున్సిపల్ హైస్కూల్(మల్లికార్జునపేట), చేబ్రోలు మహాలక్ష్మీపుల్లయ్య మున్సిపల్ స్కూల్(గుజ్జనగుండ్ల), పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయం(నల్లపాడు), ఎస్‌కేబీఎం మున్సిపల్ హైస్కూల్(ఏటీ అగ్రహారం), ఎస్.కె.బి.పి మున్సిపల్ హైస్కూల్(ఎన్జీవో కాలనీ), జడ్పీ హైస్కూల్(నల్లపాడు), పీఎంసీ హైస్కూల్ (పట్టాభిపురం), ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(నల్లపాడు), శ్రీమతి గొలుసు నాంచారమ్మ కొండలరావు మున్సిపల్‌గర్ల్స్ హైస్కూల్(కొత్తపేట), ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్(చౌత్రాసెంటర్), హిందూ కాలేజ్, జేకేసీ కళాశాల, తెనాలిలోని పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయం, కోగ్నాటి శివయ్య మున్సిపల్ హైస్కూళ్లలో పరీక్ష జరుగుతుందని డీఈవో తెలిపారు. ప్రతి కేంద్రానికి తహసీల్దారు స్థాయి అధికారి, ఎన్‌టీఏ ప్రతినిధులు పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. డీఈవో వెంట ఎంఈవో ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఖాసీం, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్ విజయ్ కుమార్, హెచ్‌ఎం ఆనంద్ తదితరులు ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రతి కేంద్రం వద్ద పోలీసుల భద్రత ఉంటుందన్నారు.

ఉద్యోగం మానేశాడని గొడవ.. భర్త ఆత్మహత్య



మృతుడు బిళ్లా నరసింహారావు

రేపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం మానేయడంతో భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ గొడవలు.. భర్త ఆత్మహత్యకు దారితీశాయి. ఈ ఘటన రేపల్లె పట్టణం లోని చోటుచే సుకుంది. శనివారం పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన బిళ్లా నరసింహారావు(30) భార్య సాయిదేవితో కలిసి రేపల్లె పట్టణంలో 2వ వార్డులో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నాడు. స్థానికంగా పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా ఉద్యోగం చేస్తున్నా డు. రెండురోజుల కిందట ఉద్యోగం మానివేయడంతో.. విషయం భార్యకు తెలిసి ఇద్దరి మధ్య గొడవలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన నరసింహారావు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. వీరికి సంతానం లేదు. మృతుడి తండ్రి బిళ్లా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నరేంద్ర

రాజసానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక

● **కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

పొన్నూరు టౌన్, మే, 3 (ఆంధ్రజ్యోతి): రాజసానికి, పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీకలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బలప్రదర్శన పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ ధృడమైన శరీరం, నడకలో రాజసం, పందెంలో పౌరుషం నింపుకున్న ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన అద్భుతమన్నారు. ఎడ్ల పందేల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను అభినందించారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పాయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తమ కుటుంబాలు పశు సంపదతో మమేకమై ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం మీద ఉన్న మమకారంతో ఒంగోలు జాతి ఎడ్ల పెంపకం కష్టతరమైనప్పటికీ రైతులు వాటిని పోషిస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ ఇలాంటి బలప్రదర్శనల వల్ల ఒంగోలు జాతి ఎడ్ల గొప్పతనాన్ని బతికించే పరిస్థితి ఉందన్నారు. పాడిపరిశ్రమాభివృద్ధి ద్వారా ఒంగోలు జాతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగుపళ్ల విభాగంలో 18 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. యజమానులకు మెమెంటో, బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



బాలకృష్ణ(ఫైల్)

ఫిరంగిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అప్పులు పెరిగి, వాటిని తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కండ్రిక గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గజేంద్ర బాలకృష్ణ (35) ఐదేళ్లుగా ఎనిమిది ఎకరాల్లో పత్తి, మిర్చి పండిస్తున్నారు. ఈ ఏడాది కూడా తన ఎకరం పొలంతో పాటు.. మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పండించాడు. భారీగా నష్టం రావడంతో సుమారు రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీరే దారి కానరాక ఆరు రోజుల క్రితం గడ్డి మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలకృష్ణ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, కావ్య, కుమారుడు కార్తికేయ, భార్య విజయలక్ష్మి ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.00 అడుగులు ఉంది. ఇది 138.56 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్ ఫ్లో 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రూ. 69 కోట్ల.. జడ్పీ బడ్జెట్‌కు మోక్షం

● **సమావేశంతో పనిలేకుండానే ఆమోదం**

గుంటూరు సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): నాటకీయ పరిణామాల మధ్య స్థానికంగా ఆమోదానికి నోచుకోని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ వార్షిక బడ్జెట్‌కు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి బడ్జెట్ ఆమోదం కోసం అని మార్చి 15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు బాయ్‌కాట్ చేశారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా టీడీపీలో చేరిన నేపథ్యంలో ఆమెను ఇబ్బంది పెట్టేందుకు బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొట్టాలని వైసీపీ ముఖ్య నేతలు వారికి సూచించారు. ఈ నేపథ్యంలో కోరం లేక సమావేశం వాయిదా పడడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. తిరిగి అదే నెల 29న కూడా సమావేశం నిర్వహించాలని భావించినా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో రూ. 69,10,87,000 వార్షిక బడ్జెట్ ఆమోదం పొందకపోతే ఇబ్బంది పడతామని అధికారులు తలలు పట్టుకున్నారు.

చక్రం తిప్పిన చైర్‌పర్సన్ దంపతులు

బడ్జెట్ ఆమోదం పొందకుండా మోకాళ్లొడ్డిన వైసీపీ ముఖ్య నేతల ఆనందానికి జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు అడ్డుకట్ట వేశారు. బడ్జెట్ ఆమోదానికి స్థానికంగా ఉన్న ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచనలతో బడ్జెట్‌ను వెనువెంటనే ప్రభుత్వానికి పం పారు. చైర్‌పర్సన్ కార్యాలయం సిబ్బంది ఒకటి రెండు సార్లు కమిషనర్‌ను కలిసి బడ్జెట్ ఆమోదం ప్రక్రియను వేగవంతం చేశారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదింప చేసుకోవడంలో సఫలీకృతులయ్యారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ న్యాయవాది వైకే

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): శాంతియుత చర్చలకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని కమ్యూనిస్టు, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. గుంటూరులోని కొత్తపేటలోని సీపీఐ మల్లయ్య లింగం భవన్‌లో శనివారం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. శాంతియుత చర్చలకు సిద్ధం కాకుండా ఆదివాసీలను చంపుకుంటూ పోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికే కాక మానవత్వానికి కూడా వ్యతిరేకమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దిశగా కృషి చేయాలని కోరారు. వారికి శాంతి కమిటీ త్వరలో కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశం తీర్మానించింది. గుంటూరు జిల్లా స్థాయిలో ఏర్పడిన ఈ కమిటీ రాష్ట్రస్థాయిలో ఏర్పడబోయే కమిటీతో సమన్వయంతో పనిచేయాలని తీర్మానించింది.కోలా నవజ్యోతి, సీనియర్ న్యాయవాది వైకే, సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్ కుమార్,కోట మాల్యాద్రి పలువురు ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

కులగణనపై రాజకీయాలు సరికాదు

● **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు**

మంగళగిరి సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటే దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హితవుపలికారు. మంగళగిరిలోని



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు కులగణన చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆనాటి బ్రిటీషు ఇండియా.. భారతీయ కుల సమాజంపై స్పష్టమైన అవాహనతోనే పదేళ్లకోసారి జనగణనతో పాటే 1931 వరకు కులగణన కూడా జరిపించారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు భారత పాలకులు మాత్రం జనాభా లెక్కలతోపాటు వివిధ కులాల జనాభా లెక్కలు తీయించలేకపోవడం దురదృష్టకరమని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంటీసీ మూర్తి నేతలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ఉచితంగా వాటర్ బాటిల్స్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా రైళ్లలో ముఖ్యంగా జనరల్ బోగీల్లో ప్రయాణికులకు రైల్వే శాఖ ఉచితంగా వాటర్ బాటిల్స్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. దాతల సహకారంతో మధ్యాహ్నం వేళల్లో గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అన్ని స్టేషన్లలో ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ఎన్‌జీవోలు ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నారు. అలానే రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫాంలపై కుండలు ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. శనివారం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ ఆదేశాల మేరకు రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, నంద్యాల తదితర రైల్వేస్టేషన్లలో వాటర్ బాటిల్స్ పంపిణీ చేయించారు. ఎండలు తగ్గేంత వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన చెప్పారు. దాతలు ముందుకొచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న డీసీఎం కమలాకర్‌బాబు

నాటుసారాపై ఉక్కుపాదం

● **ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు**

క్రోసూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులు, అమ్మకం దారులు తీరు మార్చుకోక పోతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన సందర్శించి, నేరాలపై సమీక్షించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నాటు సారా నిర్మూలనకు 2.0 కార్యక్రమాన్ని సమసర్థంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకు మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి.. వారి సహకారంతో నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నేరస్తు లపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని, అటవీ ప్రాంతాలు, తండాల్లోనూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లోని కేసుల వివరాలను పరిశీలించారు. మద్యం షాపులను క్రమం తప్పకుండా తని ఖీ చేయాలని, నిబంధనలు, ఎమ్మార్పీ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.మణికంఠ, సీఐ తులసీ ఉన్నారు.



క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

నాడు - నేడు.. నాన్చుడు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్, తాగునీటి వసతి, పర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగ తి గదులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు. భవనాలకు రంగులు తదితర పనులు అరకొరగానే సాగగా పెండింగ్ పనుల ఊసే లేకుండా ఏడాది ముగిసింది. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా పనులపై ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొరగానే పనులు పూర్తి..

- పల్నాడు జిల్లాలో 1298 పాఠశాలల్లో రూ.312 కోట్లు వ్యయ అంచనాతో 8,330 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 26 ప్యాకేజీల్లో మాత్రమే నిర్మాణాలు జరిగాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 352 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 91 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉండగా 29 మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 మాత్రమే పూర్తయ్యాయి. 913 మరమ్మతుల పనులకు 284 పూర్తి చేశారు.
- గుంటూరు జిల్లాలో 919 బడుల్లో రూ.203.94 కోట్ల వ్యయ అంచనాతో 6,523 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పది ప్యాకేజీల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. 100 పాఠశాలల్లో ప్రహరీలకు 25 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 264 పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 191 పూర్తి చేశారు.
- బాపట్ల జిల్లాలో 944 స్కూల్స్‌లో 183.31 కోట్ల వ్యయ అంచనాతో 6,274 చేపట్టాలని నిర్ణయించారు. 112 స్కూల్స్‌లో 96 ప్యాకేజీల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 163 చోట్ల పూర్తి చేశారు. 78 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు కాగా తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 327 పనులు చేపట్టగా 215, మరమ్మతుల పనులు 586 చేపట్టగా 157 మాత్రమే పూర్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ఆపరేషన్ జరిగిన కుక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా ఏబీసీ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సిబ్బందిని ఆదేశించారు. ఏటుకూరు రోడ్డులోని జీఎంసీ ఏబీసీ సెంటర్ ని శనివారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కమిషనర్ తొలుత ఏబీసీ ఆపరేషన్ థియేటర్లు, మెడిసిన్స్ స్టోర్, సర్జరీ అనంతరం కుక్కలను ఉంచే గదులు, వాటికి ఇస్తున్న ఆహారాన్ని నేరుగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడుతూ సెంటర్లో నిర్దేశిత ప్రమాణాలతోనే ఏబీసీ జరగాలన్నారు. గత నెల 23న పునః ప్రారంభించిన ఏబీసీ సెంటర్‌లో ప్రస్తుతం ప్రతి రోజు 25 కుక్కలకు ఏబీసీ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ జరుగుతుందని, సంఖ్యని పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కుక్కలకు తగిన ఆహారం సమయానికి అందించడంలో సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఏబీసీ సెంటర్‌ని వారంలో రెండు లేదా మూడుసార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వీధి కుక్కల వలన ఏమైన సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103కి కాల్ చేయవచ్చని తెలిపారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న కొర్రపాటి చంద్రశేఖరరావు దంపతులు

కమ్మజన సేవా సమితికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ రోడ్డులో కమ్మ జన సేవ సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని నగరానికి చెందిన కొర్రపాటి చంద్రశేఖరరావు, వాణిశ్రీలు ప్రకటించారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఈ చెక్కును అందజేశారు. సామినేని మాట్లాడుతూ ఈ దంపతులు గతంలో కూడా విరాళాన్ని అందజేశారని గుర్తు చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ఫీజులో వెయ్యి రూపాయలను తగ్గించేలా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, దాతలు ఆలోకం పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

పబ్బరాజు వెంకటేశ్వరరావు చిరస్మరణీయులు

● జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): దివంగత పబ్బరాజు వెంకటేశ్వరరావు 1996లో శ్రీ షిరిడి సాయి దీనజనసేవా సమితి గుంటూరులో స్థాపించి వందలాది పేద, అంధ విద్యార్థులకు భోజన, వసతితో పాటు విద్యను అందించిన మహనీయులు అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. పబ్బరాజు వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి శనివారం గుంటూరులోని శ్రీ షిరిడి సాయి దీనజనసేవాసమితి అంధుల, దివ్యాంగుల, అనాథల శిక్షణాలయంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెలగపూడి పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ బ్రెయిలీ లిపితోపాటు ఆడియో క్యాసెట్స్ ద్వారా 10వ తరగతితో పాటు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ, పోటీ పరీక్షలకు తర్ఫీదు ఇవ్వడం లాంటి అంధ విద్యార్థులకు సేవలు అందించిన మహనీయులు వెంకటేశ్వరరావు అని కొనియాడారు. అంధునిగా ఉంటూ తన ప్రతిభతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తనుబుద్ధి కోటిరెడ్డి ప్రసంగిస్తూ పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తే అంధత్వం అభివృద్ధికి అడ్డుకాదన్నారు. అంధులైనప్పటికీ అనితర కృషితో హెడ్ మాస్టర్‌గా అభివృద్ధి చెందిన నల్లపు రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ బ్రెయిలీ లిపితో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యతోపాటు అన్ని రంగాలలో అంధులు సైతం అత్యున్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి దీనజనసేవాసమితి కార్యదర్శి పి.ఎస్.మూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుభట్ల జయ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత ఎన్.తిరుపతయ్య తదితరులు ప్రసంగించారు. తొలుత పబ్బరాజు వెంకటేశ్వరరావు చిత్రపటానికి వక్తలు, అతిథులు, పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

శిశు గృహకు విరాళంగా ఏసీ మెషిన్ అందజేత

గుంటూరు మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రాంగణంలోని ప్రత్యేక దత్తత సంస్థ సంస్థ శిశుగృహకు ఆర్క 11 క్రికెట్ ఫౌండేషన్, గుంటూరు మిత్ర బృందం ఆధ్వర్యంలో వేసవి వేడిమి నుంచి ఉపశమనం కోసం ఏసీ మెషిన్‌ను శనివారం విరాళంగా అందజేశారు. ఆర్క 11 క్రికెట్ ఫౌండేషన్ సభ్యుడు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, పీ.నాగార్జున, కేగిరి తదితరులు ఈ ఏసీ మెషిన్‌ను శిశు గృహ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, జస్వంత్, బ్రహ్మేంద్ర, ప్రవీణ్, అనిల్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా చదివితే డీఎస్సీలో విజయం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు ఒక ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడిపేట, డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్ అధ్యక్షతన డీఎస్సీపై అవగాహన సదస్సు జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ నోటిఫికేషన్‌పై అభ్యర్థులు నాలుగు ప్రధాన అభ్యంతరాలను తెలుపుతున్నారన్నారు. అభ్యర్థులు వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, డిగ్రీలో అర్హత మార్కులు 50 నుంచి 40శాతంకు తగ్గించాలని, సిలబస్ రీత్యా 45 రోజులు కాలపరిమితిని 90 రోజులకి పెంచాలని, ఒకే జిల్లాకి ఒకే పేపర్ కావాలని కోరుతున్నారని వారి అభ్యంతరాలను పరిష్కరించాలని అన్నారు. అనంతరం అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రాష్ట్ర నాయకురాలు కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న డీవైఎఫ్ఐ సభ్యులు

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు (విద్య) మే 3 (ఆంధ్రజ్యోతి):స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్ (సన్), కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మే 12 నుంచి 21వ తేదీ వరకు పది రోజులు పాటు ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు జరుగుతాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం బ్రాడీపేట యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ క్లాసులు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు పది రోజులు పాటు 2/6 బ్రాడీపేట యుటిఎఫ్ కార్యాలయంలో జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయంలో (సెల్ 9494808589) సంప్రదించాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆశిష్, మనీష్, వివేక్, ప్రతిమ, హరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

కులజనగణనపై పోరాటం చేసిన రాహుల్‌గాంధీ

● మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మస్తాన్‌వలి, నాయకులు

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కుల జనగణనపై కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేలా పోరాటం చేసిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి అన్నారు. రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులజనగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపటంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం పొన్నూరు రోడ్డులోని బారాయిమాంపంజాలోనున్న కార్యాలయంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జనగణనతో పాటు కుల గణన చేయాలని పార్లమెంటు సాక్షిగా, పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష నేతగా భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్ర పేరుతో రాహుల్‌గాంధీ ఉద్యమం చేశారన్నారు. ఈ కులగణన ద్వారా ప్రజలకు సమానత్వ, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, కాంగ్రెస్ నాయకులు అంబటి రత్తయ్య, పలగాని రామకృష్ణ, ఖలీల్, మోషే, జానీ తదితరులున్నారు.



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న దామచర్ల శ్రీనివాస్, నాగేశ్వరాచారి తదితరులు

5 నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి గురుపూజ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు బ్రహ్మంగారి గుడి వీధిలో ఉన్న జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో 332వ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు ఈనెల 5, 6, 7 తేదీల్లో జరుగుతాయని దేవస్థానం పాలకమండలి ప్రధాన కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరచారి తెలిపారు. దేవస్థానం ఆవరణలో శనివారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరణ చేసి వివరాలను వెల్లడించారు. 5న స్వామివారికి పంచామృత అభిషేకాలు, 6న పతాకావిష్కరణ, గణపతి పూజ శాంతి హోమం, 7న స్వామి వారి సజీవ సమాధి నిష్ట వహించిన పర్వదినం సందర్భంగా పంచామృతాభిషేకాలు, పల్లకి సేవ, రథోత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పావులూరి, హనుమంతరావు, దామచర్ల శ్రీనివాసరావు, గట్టి శ్రీనివాసరావు, కుంకెపూడి కోటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూస్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు

గుంటూరు (విద్య) మే 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో 'రెస్యూమ్ రైటింగ్, ఇంటర్వ్యూస్ స్కిల్స్' అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఫ్రీ లాన్సు సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ నిడమర్తి సాయి గణేష్ కుమార్ మాట్లాడుతూ రెస్యూమ్‌ని తయారు చేసే విధానం, యాక్షన్ వెర్బ్‌ను వాడే విధానం, క్రిటికల్ థింకింగ్, ఇంటర్వ్యూలో విజయం సాధించే విధానం గురించి క్లుప్తంగా వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్ పాల్గొన్నారు.

శ్రవణానందంగా గాత్రకచేరి

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం జరిగిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత పీఎల్ జయంతి, డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కళాకారులు శ్రీ త్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనలను గోష్ఠి గానం నిర్వహించారు. సంగీత విద్వాంసురాలు బి.ప్రహ్లాద తమ గాత్ర ధారణలో పలువురు వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై ఏ.కామాక్షి, పీఎల్ జయంతి, మృదంగంపై కుందుర్తి అరవింద, ఏహెచ్ సూర్య వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం వై శేషు రాణి పర్యవేక్షించారు.

అలరించిన భక్తిగీతాలాపన

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం జరిగిన భక్తిగీతాలపన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ యిమ్మడి అంజనీదేవి బృందం తమ గాత్రధారణలో భక్తిమాలలోని నారాయణ నీ నామమే, శ్రీలక్ష్మీదేవి, కృష్ణమ్మా గోపాల బాలా, అన్ని రూపములకు నీవే అంటూ పలుకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరింపజేశారు. వీరికి తబలపై పి.బాలాజీ, కీబోర్డుపై కె.రవి చక్కటి వాయిద్య సహకారం అందించారు. అనంతరం దేవాలయ పాలకమండలి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

షాపులో చోరీ

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అరండల్‌పేట 4/5లో గల కార్తికేయ పూజా సామగ్రి దుకాణంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శనివారం తెల్లవారు జాము సమయంలో ముగ్గురు దొంగలు ఇనుపరాడ్‌తో షట్టర్‌ను తొలగించేందుకు ప్రయత్నించారు. షట్టర్ రాకపోవడంతో మధ్యలో కొంత వరకు ఎత్తారు. ఓ దొంగ షాపులోకి ప్రవేశించి లోనికి ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉంచిన రూ.40 వేలు అపహరించుకుపోయారు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఇంటూరి పద్మావతి, పాల్గొన్న బండి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), మే 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారిం చేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రూరల్ మండల కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో గ్రామాల్లోని చెరువులను నింపాలని, బావులు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను మండల సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచులు, నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. పనుల్లో అవకతవకలు జరిగితే ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మండల విస్తరణాధికారి శ్రీనివాసరావు ఎంపీటీసీలు, సర్పంచులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణ మూర్తి పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖ తరపున అందవలసిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందించడానికి కృషిచేస్తామన్నారు. ఎస్పీ సీఐ-1 అళహరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసుల చేదనలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఎంతో కృషి చేసేవారన్నారు. తాడేపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.నాగేశ్వరరావు కృష్ణా నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎందరినో కాపాడారన్నారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ ఆర్మ్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఏ. రాఘవరాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, హాస్సేన్, మైల సాంబశివరావు, కరిముల్లా పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై స్పెషల్ డ్రైవ్

● జిల్లా వ్యాప్తంగా తనిఖీలు... పలువురిపై కేసులు

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యపా నంపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం సాయంత్రం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం సేవిస్తున్న మందుబాబులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఇక నుంచి బహిరంగ మద్యపానంపై మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. వెస్ట్ సబ్ డివిజన్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై డీఎస్పీ అరవింద్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు బైకులపై వెళ్లి స్వయంగా తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలలో చట్టంపై గౌరవాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్టు వెస్ట్ డీఎస్పీ అరవింద్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో నగరంపాలెం సీఐ నజీర్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు తదితరులు పాల్గొన్నారు. నల్లపాడు స్టేషన్ పరిధిలో 8 కేసులు నమోదు చేసి 25 మందిని అరెస్ట్ చేసారు.



విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తున్న మేయర్ రవీంద్ర తదితరులు

ప్రతిభావంతులను ప్రోత్సహించడం అభినందనీయం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన విద్యార్థులను సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ ప్రోత్సహించడం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సత్య సెక్యూరిటీస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు శనివారం గుంటూరు బృందావన్ గార్డెన్స్ సంస్థ కార్యాలయంలో పొగాకు బోర్డు మాజీ ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబుతో కలిసి ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, విద్యార్థులు బాల్యం నుంచే సేవ, స్నేహ భావాలను పెంచుకోవాలన్నారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు బాల్యంలోనే తమ లక్ష్యాలను నిర్దేశించు కుని దానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకుని ఉన్నత స్థాయి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ కాళహస్తి సత్యనారాయణ, ఎరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత లెక్చరర్ జీవి రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్య సాయి, ఎగ్జిక్యూటివ్ లిడియా, విశ్రాంత డీఎస్పీలు సుబ్బారెడ్డి, భగిరథ బాబు, కెవి నారాయణ, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, రామినేని సుబ్బారావు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

మేయర్‌కు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అభినందనలు

గుంటూరు కార్పొరేషన్, మే 3(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్మన్ ఉండ వల్లి శ్రీదేవి శనివారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్రని నగర పాలక సంస్థలోని ఆయన ఛాంబర్‌లో మర్యా దపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



మేయర్ రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీదేవి

యువత పోరాటాలకు సిద్ధం కావాలి

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య పిలుపు నిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్ లో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని యువతకు మోదీ మాట ఇచ్చి మోసం చేసారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండు లక్షల 38 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదని, దీంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో చల్ల మరియదాసు, శశి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రిలే నిరాహార దీక్షలు

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలో నాలుగు మూలల క్రైస్తవ సమాధి తోటలకు స్థలం కేటాయించాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పది రోజుల నుంచి జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా డాక్టర్ గోళ్లమూడి రాజసుందరంబాబు మాట్లాడుతూ దీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించారని, అందుకే దీక్షలను విరమణ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరుమళ్ళ మార్కు, పాస్టర్ సురేష్, కంచర్ల డేవిడ్, మద్దు ప్రేమ్ జ్యోతిబాబు, గద్దె రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): దేశంలో అసంఘటిత, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 5న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు రోజుకీ దేశంలో నిత్యవసర ధరలు పెరిగిపోతున్నాయన్నారు. కానీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పుప్పాల సత్యనారాయణ, కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమ డెలాకు ప్రకాశం బ్యారేజి నుంచి 1316 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 163, తూర్పుకాల్వకు 110, పశ్చిమకాల్వకు 88, నిజాంపట్నం కాల్వకు 165, కొమ్మమూరు కాల్వకు 653 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

తుళ్లూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం అనంతవరం గ్రామ సచివాలయం, మందడం గ్రామ సచివాలయం-1లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారు. మే 6న అనంతవరం, మందడం -2. సచివాలయాలు. 7న తుళ్లూరు -1, పెదపరిమి -1 గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు జరగనున్నాయి. 8న పెదపరిమి-2 తుళ్లూరు-2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నట్టు పేర్కొంది. ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు, మొబైల్ ఫోన్ నెంబర్ లింక్‌లు తదితర సేవలు క్యాంపులలో అందించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

వేళాంగిణిమాత ఉత్సవాలు ప్రారంభం

పెదనందిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో వేళాంగిణిమాత ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విచారణ గురువు బాల్తజార్ రాజ్ భక్తులకు శాంతి సందేశమిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలేరమ్మ దేవస్థానంలో చోరీ

పెదనందిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాజుపాలెంలో పోలేరమ్మ దేవస్థానంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆలయ ప్రధాన గేటు ధ్వంసం చేసి హుండీని పగులగొట్టి లోపల ఉన్న నగదును అపహరించుకెళ్లారు. దేవాలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుపవన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలకు ఒకసారి హుండీ లెక్కింపు చేస్తారని, లెక్కింపు జరిగి సుమారు మూడు సంవత్సరాలు అయ్యిందని అధిక మొత్తంలోనే నగదు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుగ్గిరాల(మంచికలపూడి), మే 3 (ఆంధ్రజ్యోతి): మంచికలపూడిలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో తలకు బలమైన గాయం కావడంతో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన కూచిపూడి గోపి శుక్ర వారం రాత్రి అదే గ్రామానికి చెందిన నన్నెపాగ రఘునాధరావు తలపై రోకలి బండతో కొట్టాడు. తలకు దెబ్బ బలంగా తగలడంతో స్పృహ కోల్పోయిన రఘునాధరావును తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో, రఘునాధరావును గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసిన అనంతరం శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో జరిగిన ఘటనకు సంబంధించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దుగ్గిరాల ఎస్‌ఐ ఎస్ వెంకటరవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

151వ రోజుకు చేరుకున్న దీక్షలు

తాడేపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, చట్టప్రకారం రావాల్సిన బకాయిలు కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శనివారంతో 151వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై సాంబశివరావు, కె హగ్గయ్య, సీహెచ్ పిచ్చయ్య, జీ కొండ, ఎం గురవయ్య, కూర్చున్నారు. ఈ రిలే దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, టీ నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, యెహోషువ, ఎస్‌కే ఇమాంబీ, శారమ్మ, సువర్ణకుమారి, దుర్గాభవాని, రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు

ప్రత్తిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): లీడ్ గ్రూపు నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో చౌడవరం గ్రామంలోని బ్రిలియంట్ స్కూల్ 6వ ర్యాంకు సాధించింది. దేశవ్యాప్తంగా ఆరు వేల పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీలలో 6వ ర్యాంకు సాధించిన బ్రిలియంట్ స్కూల్ డైరెక్టర్ చాదరాజుపల్లి ఖాజావలి, సుమలతకు సంస్థ సీఈవో సుమిత్ మిత్ర అవార్డునందు అందజేశారు. మారుతున్న విద్యావిధనంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. అందుకు గాను హైదరాబాదులో జరిగిన జాతీయస్థాయి కార్యక్రమంలో మెహతా చేతుల మీదగా ఈ అవార్డును ఖాజావలి దంపతులు అందుకున్నారు.

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు(విద్య) మే 3(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్ (సన్), కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మే 12 నుంచి 21వ తేదీ వరకు పది రోజులు పాటు ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు జరుగుతాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం బ్రాడీపేట యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ క్లాసులు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పది రోజులు పాటు 2/6 బ్రాడీపేట యుటీఎఫ్ కార్యాలయంలో జరుగుతాయని తెలిపారు. వివరాలకు సెల్ 9494808589 సంప్రదించాలని సూచించారు.

బస్ షెల్టర్లపై కొరవడిన పర్యవేక్షణ

- శిథిలావస్థకు చేరుకుంటున్న తీరు
- వేసవిలో ప్రయాణికుల అవస్థలు


రావెలలో బస్‌షెల్టర్‌కు అడ్డుగా పెట్టిన బడ్డీకొట్లు


అడ్డరోడ్డులో ఉన్న బస్‌షెల్టర్‌లో విరిగిపోయిన సిమెంట్ బల్లలు

తాడికొండ, మే 3(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం, ఆపై వడగాలులు.. అయినా ప్రయాణికులకు తప్పని ప్రయాణాలు. గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో ఎండా, వానా, చలి లెక్క చేయకుండా వారి పనుల మీద ప్రయాణాలు చేస్తుంటారు. అయితే బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల కోసం ప్రయాణికులు వేచి ఉంటుంటారు. వారు కూర్చోవడానికి బస్సు షెల్టర్స్‌ను ఆశ్రయిస్తుంటారు. ప్రయాణికులు వేచి ఉండే బస్సు షెల్టర్లు నిర్వాహణ లోపంతో దీనావస్థకు చేరుకుంటున్నాయి. మండలపరిధిలోని గ్రామాల్లో ప్రయాణికులు వేచి ఉండటానికి నిర్మించిన బస్‌షెల్టర్లు అధ్వానస్థితిలో ఉన్నాయి. ప్రయాణికులు కనీసం నిలబడే అవకాశం కూడా లేదు. బస్‌షెల్టర్లు మూసినట్లు బడికొట్లు, బ్యానర్లు, ఆటోలను అడ్డుగా నిలుపుతున్నారు. షెల్టర్లపై పర్యవేక్షణ కొరవడటంతో తాడికొండ అడ్డరోడ్డు సెంటర్లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌లో ఉన్న సిమెంట్ బల్లలు విరిగిపోయాయి. రాత్రి వేళ్లలో ఇక్కడ కొంత మంది మద్యం తాగుతున్నారు. అడ్డరోడ్డు సెంటర్‌లో నాలుగురోడ్లు కలిసే జంక్షన్. కానీ కేవలం రెండు బస్ షెల్టర్స్ మాత్రమే ఉన్నాయి. అందులోను ఒక షెల్టర్ పూర్తిగా పాడైపోయింది. గుంటూరు, పొన్నెకల్లు వెళ్లే ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉండటానికి అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఉన్నది. తాడికొండ చింత చెట్టు సెంటర్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకొని పడిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రావెల గ్రామం బైపాస్ రోడ్డులో ఉన్న బస్‌షెల్టర్ ముందు బడ్డీకొట్లు అడ్డుగా పెట్టారు. లాంలో ఉన్న షెల్టర్ ముందు ఆటోలను నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు ఎండలో నిరీక్షించే దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు తక్షణమే బస్‌షెల్టర్లు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

మహిళలు విద్య, వ్యాపార రంగాల్లో రాణించాలి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


గ్రామీణ మహిళలకు యంత్ర పరికరాలను పంపిణీ చేసిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ విద్య, వ్యాపార రంగాల్లో పురోగతి సాధించాలని కేంద్ర గ్రామీణా బివృద్ధి, సమాచారశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ సూచించారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శనివారం ఆరు మండలాలకు చెందిన గ్రామీణ మహిళలకు వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి ఉపయోగించే యంత్రాలను శనివారం పంపిణీ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద ఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మహిళలు కష్టాలతో కుంగిపోకుండా మనోధైర్యంతో స్వయం ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. పేదరి కంతో నలిగిపోయే మహిళలు ఆత్మ స్థైర్యంతో నూతన వ్యాపారాలను ప్రారంభించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలను వినియోగించుకోవాలనిసూచించారు. బ్యాంకు ల ద్వారా సబ్సిడీ రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. తొలుత మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనను మంత్రి సందర్శించి మహిళలను అభినందిం చారు. అనంతరం ఎస్‌ఆర్‌ఎం ఎంటర్‌ప్రిన్యూర్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాసి అదితి కార్యక్రమ వివరాలను వెల్ల డించారు. మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన వంద అంకు ర సంస్థలకు రూ.72 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం వైస్ చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా, ప్రోవైస్ చాన్సలర్ సతీశ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్తు

మంగళగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫజీలతుషేక్ అష్రఫ్ ఫైజీ అన్నారు. మంగళగిరి ఆయేషా సిద్ధిఖీ మదర్సా 12వ వార్షిక వేడుకలు ఈద్గా షాదీఖానాలో శనివారం ఘనంగా నిర్వహించారు. అష్రఫ్ ఫైజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత 12 సంవత్సరాలుగా మదర్సా నిర్వహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్యను కూడా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆలిమ్ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థినులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ అబ్దుల్ అలీమ్ జామయీ, అన్వరీ ఇస్లామిక్ సెంటర్ అధ్యక్షుడు మొహమ్మద్ జహంగీర్ సాహెబ్, ఎస్‌పి సిలార్, షబ్బార్, ఖదీర్, సంధాని, రఫీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో రెండోరోజు ఉత్సవాలు


కలశాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

దుగ్గిరాల, మే 3 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠా ఉత్స వాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు. 4వ తేదీన ఆదివారం పెద్దయెత్తున ఆలయ పునఃప్రతిష్ఠ, రాజగోపుర శిఖరప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్న విషయం విదితమే. రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు నిత్యపూజలు, వాస్తు పూజ, హోమ, బలిపర్యగ్ని కరణ, ప్రభాత బలి, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, అధివాసం తదితర కార్యక్రమాలను వేదపండితులు పలువురు పుణ్య దంపతులతో జరిపించారు. ఉదయం 11గంటల కు భక్తులు బిందెలతో తమ ఇళ్ల నుంచి వెంటతెచ్చుకున్న నీటితో స్వయంగా విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఆదివారం జరిగే ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మం త్రులు నారా లోకేశ్, ఆనం రామ నారా యణరెడ్డి, కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర రావు, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీ వినయ్‌చంద్, కమిషనర్ కె.రామచంద్రమోహన్, పలువురు దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు తదితరులు హాజరుకానున్నారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో కోగంటి సునీల్ తెలిపారు. ఉదయం 7.59ని.లకు ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం 11గంటల నుంచి వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవం


వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు

వట్టిచెరుకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం గాయత్రి శక్తి పీఠం నిర్వాహకులు గాయత్రి హోమం నిర్వహించారు. రాత్రికి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం తిరుమలాచార్యులు, శ్రీమన్నా రాయణలు ప్రత్యేక పూజలు నిర్వహించగా శాంతి కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదనందిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో 8 రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని మక్కెన జవహర్‌రాణి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ కలిగి ఉండడం వల్ల ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్‌లకు, వేసవిలో ఎండలో తిరగకుండా ఉండేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడే నేతన్న కోసం 3కే రన్


3కే రన్ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న రాగవీణ తదితరులు

మంగళగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా భారతీయ సంస్కృతిని కాపాడుతున్న నేతన్న కోసం శారీ వాక్ పేరిట మంగళగిరిలో 3కే రన్ నిర్వహిస్తున్నట్టు వీ-వైబ్ సంస్థ అధినేత రాగ వీణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంగళగిరి ఆటో నగర్‌లోని వీవర్‌శాలలో గోడప్రతులను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ప్రతి మనిషి జీవితంలో మాతృమూర్తుల పాత్రను, సమాజ శ్రేయస్సుపై అమ్మ ప్రభావాన్ని గుర్తు చేసుకుంటూ పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. శారీ వాక్ పేరిట మంగళగిరి చేనేత మగ్గాలపై తయారైన నేత వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో నిర్వహించి బహుమతులు అందజేస్తారన్నారు. నృత్య కళాకారిణి ప్రీతి బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. అనంతరం 3కే రన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 7997603025, 9030003025 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ఆహం ప్రణ ఫౌండేషన్, వేగ జ్యూయలర్స్, గ్రాండ్ విజయవాడ బైజీఆర్బీ, జేడీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్, ఇండియా ఇన్సూర్, ఫైకేర్ సర్వీసెస్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని మాతృమూర్తులను గౌరవించేందుకు సమయాన్ని వెచ్చించాలని కోరారు.

20వ తేదీ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, మే 3, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం తాడేపల్లి పట్టణంలోని వివిధ కంపెనీల మేనేజర్లకు గోడౌన్‌లో మేస్త్రీలకు కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీస్ అందజేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్, సర్వో ఆయిల్ కంపెనీ, హిందుస్థాన్ పెట్రోలియం బంక్, చేపలు గ్రేడింగ్ కంపెనీ, ఎమ్మార్వో కార్యాలయం, క్యాపిటల్ బిజినెస్, బిర్లా మోర్ కంపెనీ, చైతన్య గోదావరి బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, టీటీ యార్డ్ తదితర చోట్ల ఆయా బాధ్యులకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశర్లు, ఏఐటీయూసీ వెంకటయ్య, ఐఎన్‌టీయూ దర్శనపు శామ్యూల్, వైఎస్సార్ టీయూసీ శ్రీనివాసరాజు, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఆదినారాయణ, ఐఎఫ్‌టీయూ చెన్నయ్య పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావుకు సన్మానం


హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు దంపతులకు సన్మానం

తాడేపల్లి టౌన్, మే 3, (ఆంధ్రజ్యోతి): 12 ఏళ్లుగా ప్రకాశం బ్యారేజి అవుట్ పోస్టు కార్యాలయం వద్ద విధులు సమర్థవంతంగా నిర్వహించి వందల మంది ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. క్షణికావేశంలో ఎంతోమంది కృష్ణానదిలో దూకి ఆత్మ హత్య చేసుకోవడానికి వచ్చేవారిని అడ్డుకుని వారికి నచ్చచెప్పి కౌన్సెలింగ్ ఇచ్చి వారి బంధువులకు అప్పగించి అధికారుల నుంచి రివార్డులు అందుకున్నాడు. గుంటూరు ఎస్పీ కార్యాలయంలో నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. తాడేపల్లి సీఐ కళ్యాణరాజు, ఎస్‌ఐలు, తోటి సిబ్బంది నాగేశ్వరరావుకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు బాధితులతో సీఆర్డీఏ అధికారుల సమావేశం


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ పద్మావతి

తుళ్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో రోడ్డు బాధితులతో సీఆర్డీఏ అధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. తుళ్లూరు గ్రామ తూర్పు భాగంలో ఎన్ - 13 రోడ్డు, కొత్తూరులో ఈ-5 రోడ్డు కింద ఇళ్ల స్థలాలు కోల్పోతున్న దాదాపు 70 కుటుంబాల వారితో కాంపిటెంట్ అధి కారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పీ పద్మావతి ఈ సమావేశం నిర్వహించారు. సంబంధిత యజమానులు పత్రాలు అం దజేయాలని డీసీ సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే రైతులు తెలియజేయాలని డీసీ కోరారు. ఎంతమేర పోతున్నాయి. పరిహారం ఎంత ఇస్తారు.. అనేది తెలియకుండా పత్రాలు ఎలా ఇస్తా మని సదరు బాధిత కుటుంబాల వారు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సర్వే చేసి ఎంతెంత రోడ్లు కింద పోతుందనేది తెలిపితే పత్రాలు ఇవ్వ టానికి అభ్యంతరం లేదని తెలిపారు. నిర్మాణాలున్న వాటికి తాజాగా నిర్మాణం చేస్తే ఎంత ఖర్చు అవుతుందో అంత పరిహారం అందించాలని కోరారు. ఎక్కడ ఇస్తారో కూడా చెప్పాలని కోరారు. సోమవారం సర్వే చేసి సదరు వివరాలు అందజేస్తామని డీసీ సమాధానం ఇచ్చారు. సమావేశంలో తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం యూనిట్ తహసీల్దార్ రవిబాబు రైతులు పాల్గొన్నారు.

మలినేని ప్రొఫెసర్ విజయసారధికి పోస్ట్‌డాక్


విజయసారధిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ పెరుమాళ్ళు

వట్టిచెరుకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లగుడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ విజయ సారధి మలేషియాలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో, డిజిటల్ ఇన్నోవేషన్ యూసీఎస్ఐ విశ్వవిద్యాలయం నుంచి వైర్లెస్ కమ్యూనికేషన్‌లో డాక్టర్ రేణు, కొలంద్రై స్వామి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు పోస్టుడాక్ ఫెలోషిప్‌ను పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పెరుమాళ్ళు, కళాశాల ప్రిన్సిపాల్ జే అప్పారావు, సహచర ప్రొఫెసర్‌లు అభినందనలు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు





రత్నకుమారిని సత్కరిస్తున్న కళాపరిషత్ సభ్యులు



స్వేచ్ఛ నాటికలో సన్నివేశం

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు

● రంగస్థల నటి రత్నకుమారి జీవిత సాఫల్య పురస్కారం

తెనాలి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): కొలకలూరులో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలలో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. కొలంకపురి నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కార్యక్రమాలను తాళ్లూరి సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటిమణి ఎం.రత్నకుమారిని గోపరాజు హేమలత జీవితసాఫల్య పురస్కారం ప్రదానంచేసి ఘనంగా సన్మానించారు. పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన సభలో రంగస్థల నటుడు, దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్, ప్రభాకరరెడ్డి, వరప్రసాద్, నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, చంద్రశేఖర్, సత్యనారాయణ, శివప్రసా ద్, ముత్యాల నాయుడు పాల్గొని, ప్రసంగించారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు స్వేచ్ఛ నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను నారాయణ మూలకథ అందించగా శివరామ్ నా టకీకరణలో బిఎం.రెడ్డి దర్శకత్వం వహించారు. విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన 27వ మైలు రాయి నాటికను మాధవ్ రచించగా వాసు దర్శకత్వం వహించారు. విజయవాడ మైత్రి కళానిలయమ్ కళాకారులు ప్రదర్శించిన బ్రహ్మస్వరూ పం నాటికను స్నిగ్ధ రచించగా పురుషోత్తం దర్శకత్వం వహించారు.

మొక్కలను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తెనాలి, మారీసుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి వ్యవసాయ మార్కెట్‌లో గోదాంల షట్టర్లకు రావి చెట్లు, గడ్డిజాతి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో గోదాముల పటిష్టత దెబ్బతినే పరిస్థితిలో ఉన్నాయని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ మార్కెట్ అధికారులు స్పందించారు. శనివారం గోదాం షట్టర్ ముందు పెరుగుతున్న రావి, పలురకాల గడ్డిజాతి మొక్కలను అధికారులు తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు.

నేడు రేపల్లె రైళ్ల రద్దు

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె-గుంటూరు రైళ్లను రైల్వే శాఖ ఒకరోజు రద్దు చేసింది. తెనాలి పట్టణంలోని మొండిగోడల వద్ద డ్రెయినేజీపై నిర్మిస్తున్న వంతెనల కారణంగా ఆదివారం రేపల్లె రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు. రేపల్లె-గుంటూరు, రేపల్లె-తెనాలి రైళ్ల రద్దు కాగా సికింద్రాబాద్-రేపల్లె రైలును రీషెడ్యూల్ చేశారు.

కోర్టులో రిట్ వేసినవారు సమావేశం ఎలా పెడతారు?

● బైలా ప్రకారం చట్టబద్ధ కమిటీ మాదే



మాట్లాడుతున్న నూతన కార్యవర్గం

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో వాసవీ ఆలయ పాత పాలక వర్గం రిట్ పిటిషన్ వేసి.. సమావేశం ఎలా పెడతారని నూతన పాలకవర్గ అధ్యక్షుడు పెండేల వెంకట్రావు ప్రశ్నించారు. బోసురోడ్డులోని ఆలయ ఆవరణలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, బై లా ప్రకారమే వచ్చిన సభ్యులతో కోరం పూర్తిచేసి నూతన కమిటీని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం నిర్వహించామన్నారు. పాత కమిటీ కాల పరిమితి నవంబరులోనే తీరిపోయిందని, మళ్లీ సర్వసభ్య సమావేశాలు అంటూ ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఆదివారం ఎలాంటి సమావేశాలు జరిపే హక్కు పాత కమిటీకి లేదని ఆలయ కమిటీ సభ్యులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కార్యదర్శి తాతా శ్రీనివాసరావు, హరికిషోర్, రాజేష్, రాధాకృష్ణమూర్తి, సుబ్బారావు, శివలింగేశ్వరరావు, రవికుమార్, రమేష్, మద్ది మల్లికార్జునరావు తదితరులు పేర్కొన్నారు.

రెండు వర్గాల విస్తృత ప్రచారం

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ వర్గపోరు ఉధృతమైంది. ఆదివారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని సభ్యులందరూ రావాలని పాత కమిటీ... సమావేశాలు జరపడానికి పాత కమిటీకి హక్కులేదని, ఈ సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కావద్దని కొత్త కమిటీ.. ఇలా శనివారం పట్టణంలో మైకు ప్రచారాలు నిర్వహించారు. ఆలయంలోని ఒక కల్యాణ మండపంలో ఒక వేడుకకు అనుమతి ఇచ్చి సిబ్బంది డబ్బులు కూడా కట్టించుకున్నారు. శుక్రవారం సదరు వేడుక జరుపుకునే వారు కల్యాణ మండపంలో డెకరేషన్ చేసుకునేందుకు వెళ్లగా పాత కమిటీ ఒక తాళం, కొత్త కమిటీ మరో తాళం వేయడంతో ఆందోళన చెందారు. తమ వేడుక జరుపుకోవడానికి అనుమతించాలంటూ తాళాలు తీయించాలని రెండు కమిటీలను వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

గాలులతో కూడిన చిరుజల్లులు



కొల్లిపరలో ఇటుక బట్టీకి తడవకుండా పట్టలు కప్పుతున్న కూలీలు

● ఆందోళనకు గురైన రైతులు

కొల్లిపర, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుని పలు చోట్ల గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. మబ్బులు కమ్ముకుని రావటంతో పాటు గాలులు వీచి చిరుజల్లులు పడటంతో చేతికి వచ్చిన మొక్కజొన్న, జొన్న పంటలు ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర, తూములూరు, అన్నవరంగౌడపాలెం, హనుమాన్‌పాలెం, బొమ్మువానిపాలెం, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో పసుపు వండి ఆరబెట్టారు. దీంతో రైతులు హడావిడిగా పంటలను రక్షించుకోవడానికి పరుగులు తీశారు. ఇటుక బట్టీలకు ప్లాస్టిక్ పరదాలను నిర్వాహకులు కప్పుకున్నారు.



కల్లాల్లో ఎండబెట్టిన పసుపుపై పట్టలు కప్పుతున్నరైతులు



మొక్కజొన్నలను తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరించిన ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, వెంకటేష్ తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక గాంధీ నగర్‌లోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో నియోజకవర్గం నాయలకులు 66వ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథి ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ వలి పాల్గొని, జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రాజేష్ బిల్లా, జిల్లా సహాయ కార్యదర్శి పాశం వెంకటేష్, కోలా శేఖర్, మన్నెం నరేంద్ర, శరత్, హేమంత్, రాము పాల్గొన్నారు.

జాతీయ మహాసభను జయప్రదం చేయండి..

తెనాలి, మారీసుపేట,మే 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావుతో కలసి జాతీయ మహాసభ గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లా నుండి వందల సంఖ్యలో యువత పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రజేష్ బిల్లా తదితరులు పాల్గొన్నారు.

నిప్పు.. పర్యావరణానికి ముప్పు

● పంట వ్యర్థాలను తగలబెడుతున్న రైతులు

● పెరిగిపోతున్న వాయు కాలుష్యం



కొల్లిపరలో యంత్రాలతో కోతకోసిన వ్యర్థాలను తగలబెడుతున్నరైతులు

కొల్లిపర, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యంత్రాలతో కోత కోయగా వచ్చిన వ్యర్థాలను రైతులు తగలబెడుతున్నారు. దీంతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. పొలంలో పంట వ్యర్థాలు కాల్చివేయడం వల్ల భూసారానికి ముప్పు ఏర్పడుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో ఈ సంవత్సరం రెండవ పంటగా రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న కోత కోయటానికి ఎక్కువ మంది రైతులు ఆధునిక యంత్రాలను వినియోగించారు. అనంతరం వ్యర్థాలను కొంత మంది రైతులు పశుగ్రాసం కోసం గృహాలకు తరలించారు. ఎక్కువ మంది రైతులు వాటిని తగుల బెట్టేందుకు సిద్ధపడుతున్నారు. పంట వ్యర్థాలను కాల్చివేయడంతో.. వెలువడే పొగ దట్టంగా సమీప రోడ్లను కమ్మేస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడంతో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతోంది. వ్యర్థాలను తగుల బెట్టకుండా రోటోవేటర్‌తో పొలంలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, పశుగ్రాసం కింద వినియోగించడంతో పశువులకు పోషక విలువైన ఆహారాన్ని అందించవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు ఈ దిశగా ఆలోచన చేసి వ్యర్థాలను కాల్చి వేయకుండా.. పనికి వచ్చే విధంగా వాటిని వినియోగించు కోవాలని సూచిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో చివరి దశలో పంట వ్యర్థాలను తగుల బెట్టడం వల్ల కలిగే అనర్థాలు, నష్టం గురించి రైతులకు అవగాహన కల్పించాల్సిన అవశ్యకత అధికారులపై ఉంది.

భూసార పరీక్షలపై అవగాహన



మట్టి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏవో తదితరులు

తెనాలి రూరల్, మే3(ఆంధ్ర జ్యోతి): భూసార పరీక్షలు జరిపే విధానంపై వ్యవసాయ సిబ్బందికి, రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. పెదరావూరులో ఏడీఏ ఉషారాణి అధ్యక్షతన ఏవో ప్రేమసాగర్ రైతుసేవా కేంద్రం సిబ్బందితో పంట పొలాల్లో మట్టిని నమూనాల సేకరణను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం

తెనాలిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం కనుల పండువగా శనివారం నిర్వహించారు. అంగలకుదురు ఆంధ్ర వ్యాలీకి వాసుదాసు స్వామి పరంపర పీఠం దాసుకుటిలో 68వ సీతారామస్వామి లక్షమల్లె పూల పూజా కార్యక్రమంలో భాగంగా కల్యాణం జరిపించారు.



స్వామి వార్ల కల్యాణంలో మంగళ సూత్రధారణలో భక్తులకు చూపుతున్న పీఠాధిపతి

నేటి నుంచి భావన్నారాయణ స్వామి

బ్రహ్మోత్సవాలు



శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మీసమేత సాక్షిభావన్నారాయణస్వామి

పొన్నూరు టౌన్, మే, 3 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో వేంచేసియున్న సాక్షిభావన్నారాయణస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ఉత్సవాలకు అంకురార్పణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం పంచామృత అభిషేకాలు, పెళ్లికుమారుని ఉత్సవం, శేషవాహనసేవ, 6న సరస్వతీదేవి అలంకారంలో హంసవాహన సేవ, 7న కోదండరాముడిగా హనుమత్ వాహనసేవ, 8న శక్తి స్వరూపిణిగా సింహ వాహనసేవ, 9న రాజాధిరాజుగా, 10న శ్రీకృష్ణ అలంకారంలో పొన్నవృక్షవాహన సేవ, 11న గజవాహన సేవ, రాత్రికి సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. 12న గరుడోత్సవం, స్వామివారి దివ్య రథోత్సవం జరుగనున్నాయి. 13న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం, హయవాహనసేవ, 14న తెప్పోత్సవం తదనంతరం ఏకాంత సేవలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ అధికారులు, అనువంశిక ధర్మకర్త రాజా వాసిరెడ్డి సుధాస్వరూప్ బహద్దూర్ మన్నె సుల్తాన్ దొర, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో దేవదాయశాఖ ఏసీ



రాష్ట్ర దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ దంపతులకు స్వామి వారి జ్ఞాపకం అందజేస్తున్న ఈఓ లీలా కుమార్

పెదకాకాని, మే 3(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ అదనపు కమిషనరు తెనాలి చంద్రకుమార్ దంపతులు శనివారం దర్శించారు. ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, ఆలయ అర్చక స్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ వారికి సాదర స్వాగతం పలికారు. శ్రీస్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటము, ప్రసాదాలు అందజేశారు.

వృద్ధాశ్రమం పై అంతస్తు నిర్మిస్తాం..

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమం పై అంతస్తు నిర్మాణానికి దాత కత్తుల సాంబశివరావు ముందుకు వచ్చారు. గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆశ్రమంలో వృద్ధులకు వసతి చాలకపోవడంతో ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్యాస్ పోస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోండి

● డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

తెనాలి, మారీసుపేట,మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తపాల శాఖ ప్రవేశ పెట్టిన గ్యాస్ పోస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కొత్తపేటలోని తెనాలి హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్‌పోస్ట్ ద్వారా సామాజిక, సాంస్కృతిక, పుస్తకాలు రాయితీ ధరలకు పంపించడానికి ఈ సేవలను రూపొందించామని తెలిపారు.

ఖాజీపేట అమ్మవారి ఆలయంలో చోరీ

తెనాలిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేట గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న లక్ష్మీ మైసమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి అమ్మవారికి అలంకరించిన రూ.60వేలు విలువజేసే నగలు అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుడు గోపిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ శనివారం తెలిపారు.

ఎన్‌సీసీ బాలికలకు వార్షిక శిక్షణ ప్రారంభం




హాజరైన ఎన్‌సీసీ విద్యార్థినిలు, ఇన్‌సెట్లో ప్రసంగిస్తున్న ఎన్‌సీసీ అధికారి

పెదకాకాని, మే 3(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి యూనివర్సిటీలో శనివారం 10ఏ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ, గుంటూరు గ్రూప్ 8వ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నా ల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, ఏవో మేజర్ అవినాసీ పట్వాల్ పర్యవేక్షణలో 10 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 10ఏ బెటాలియన్ గుం టూరు గ్రూప్‌లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 426మంది బాలికలు ఈ వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఎన్.సి.సిలో శిక్షణ పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశం క్యాడెట్ల ఉన్నతికి తొడ్పడుతుందని కల్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ తెలిపారు. ఎన్.సి.సి. ఆఫీసర్ ఎ.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు, కళాకారుడు వెంకటపెద్దిరాజు మృతి



పెద్దిరాజు (ఫైల్‌ఫొటో)

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సంగీత దర్శకుడు, కళాకారుడు తాడివలస వెంకటపెద్దిరాజు (51) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తండ్రి పట్టణంలో ప్రముఖ మ్యూజికల్ బ్యాండ్ పార్టీ నిర్వాహకుడు. ఆయన వారసత్వాన్ని అందుకుని 50 మంది సంగీత కళాకారులతో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన మృతదేహానికి పలువురు కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, సైదారావు, సదాశివ, సుభాని, కళాకారులు వెంకట్, ఉమాశంకర్, వివేకా విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, రామరాజు తదితరులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

జాస్మిన్ కుటుంబానికి కృష్ణమాదిగ పరామర్శ

తెనాలి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సామాజిక న్యాయ సమీక్ష కమిటీ మాజీ సభ్యురాలు ఆరుగొలను జాస్మిన్ కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. ఆమె తల్లి హేమలత మృతి చెందడంతో.. చెంచుపేటలో శనివారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో కృష్ణమాదిగ పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. హేమలత భర్త రాజారావు దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ ముఖ్య అనుచరునిగా ఉన్నారు. ఎమ్మార్పీఎస్ ఎంఈఎఫ్ నాయకులు, మాజీ ఏపీపీ ఇందుపల్లి రాజారామ్, ఆళ్ల మూడి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన మందిర ప్రతిష్ఠ

కొల్లిపర, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో శనివారం నూతన మందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకుడు ఎం.సుదర్శనం ఉదయ 9 గంటలకు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం. ప్రభుదాస్ పాల్గొన్నారు. సుదర్శన్ దంపతులను సంఘ కాపరులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కొల్లి రజనీ, సంఘ కాపరులు జయరావు, సుమన్, దైవసేవకులు జాకబ్, జాషువా, జానకమ్మ పాల్గొన్నారు.



